# ?

కలా – నిజమా ? కవుల కల్పనలోనివా - వాస్తవంగా ఈలాటి ఘోరాలు జరుగుతాయా? విధికి అంత ఓర్వలేని తనం ఎందుకో ?

* * *

మామూలుకన్నా కొంచెం ఆలస్యంగా నిద్రలేచాడు. బద్ధకం తీరేదాకా పక్క దిగకుండానే రాత్రి మొదలు వేసిన నవలను ఆఖరు చేశాడు. అద్దం దగ్గర నిలుచుని క్రాప్ సరిచేసుకుని, తన అందాన్ని చూసి మురుస్తూ .... ముసి ముసి నవ్వుతో చిత్ర మూర్తిగా ఉన్నా, నవకాలు చిందిస్తూ ఉన్న హైమ ఫొటోగ్రాఫును చాలాసేపు సాకూతంగా వీక్షించాడు....“ఎన్నాళ్ళయింది వెళ్ళి - ఎప్పుడు వస్తుందో ? ఈ ఆడ పడుచుల మొరాయింపులకు అంతు ఉండేనా ? పుట్టింట్లో విందులు కుడుస్తూ కూర్చుంటే “ఇయం గేహే లక్ష్మీః” అని నమ్ముకుని ఆసపడుతూండే వాళ్ళపని మరి ఇంతేనా? చెపుతూంటాను, కథ వ్రాసిపెట్టమంటే ఏవో సాకులు చెప్పి తప్పించుకునే ఆలసత్వం అంతా ఎక్కడికి పోయింది? ఎగ్జిబిషన్ కోసం వాళ్ళ అమ్మ ఏవో కుడుతూంటే, తను కూడా అది పోయేదాకా అక్కడే ఉండాలేం ?....నడుము వాల్చకుండా రోజూ పొద్దస్తమానమూ కూచుంటున్నామంటే నాకేమన్నా ఒలికిందా ఇక్కడ ?.... నా జేబురుమాళ్ళకు పోగులుతీసి అంచులు కుట్టిపెడతానని ఇక్కడికి ఎన్ని వాయిదాలయినాయి? ప్రైజు వస్తుందిట. నే నున్నాను చాలదూ?....వాళ్ళనాన్న చవుకగా ఐదు వందలకి దొరికానని కొని ఇచ్చాడుగా ! అబ్బ ! ఈ పెళ్ళాలన్నవాళ్ళు ఎప్పుడూ ఇంతే....”

మెట్లుదిగి వస్తున్నాడు. అంతలో ఆగిపోయి కల కంటున్నానా అని భ్రాంతితో హర్షవిస్ఫారిత నయనాలతో చూసినాడు. నిజమే, హైమ -కటకటాలను ఆనుకుని నిలుచుని ఉన్నది.

మెట్లు లెక్కపెట్టుకుంటూ దిక్కులు చూస్తూ తాపీగా దిగే అలవాటు ఆ నిమిషాన మాయమైపోయింది. ఒక్క చెంగున ఆమె వద్దకు దూకేశాడు వరదరాజు. హైమ, అతని ఆ వేగాన్ని గమనించి కొంచెం వై దొలగింది.

"నిజమేనా?"

"ఏమిటి?" అని హైమ అమాయికంగా చూస్తూ, ఏమీ తెలియని దానిలాగా అడిగింది.

"నిజంగా....నీవు—నీవేనా కనబడుతూంది?"

హైమ నవ్వింది.

"నిద్రలేవగానే ఎవరి మొగము - నా ముఖమే కాదూ చూసుకుంది? మంచిదే నన్నమాట—"

"ఇప్పుడేనా నిద్రలేవడం?"

"కాదు, చాలా సేపయింది....కాని—"

"ఇంత సేపటిదాకా ఏం చేస్తూన్నారూ మరి క్రిందికి రాకుండా?"

"కలగంటున్నాను. తమ దర్శన భాగ్యం ఇంత త్వరగా ఈలా తలవని తలంపుగా—"

"చాల్లెండి....మరీ నేర్చుకుంటున్నారు...."

"నేర్పడానికి నీవు దగ్గర లేందేనా?"

"అన్ని ఉత్తరాలు వ్రాయకపోతే మీరు రాలేక పోయినారూ? సెలవ రోజున వస్తే మనం ఇద్దరం కలిసి వచ్చే సేవాళ్ళం కాదూ?"

"నేను వస్తే....మరి రాణీగారికి తీరా దయ వస్తుందో, రాదో - అసలు దర్శనమే కరవౌతుందేమోనని భయపడ్డాను."

"ఈ తలాయింపులకేంలెండి. బయలుదేరడానికి బద్ధకమనరాదూ?"

"పోనీ దయతలచి నీవే రావా అని—"

"అవును, ఈ మొగవాళ్ళమతమే ఇది. ఎవరికోసం వస్తుందా అని దిలాసా. పంపించి, తిరిగి మొగమైనా చూడరమ్మా.... ఈ జాతి లక్షణమే ఇది."

వరద, మారుమాట చెప్పకుండా లోపలికి వెళ్ళిపోయినాడు. స్నానాదికములు పూర్తి చేసుకుని వచ్చి హాల్లో కూర్చున్నాడు. హైమ వేషం మార్చేసుకుని సరిగపని చేసిన రాజ్‌పుటానా సిల్కుచీరె కట్టుకుని వచ్చి అతని సరసను నిలుచున్నది.

"మోహినిలాగా ఉన్నావు...."

హైమ చిరునగవుతో అతని ముంగురులు సరిచేస్తూ "నాకు తెలుసులెండి మీ యెత్తు. అమృతదానం - కాఫీ....కోసం ఇన్ని వగలా?"

కాఫీ కప్పుల్లో పోసింది. అతడు చూసి ఊరుకున్నాడు.

"తాగండి"

వరద, పసిపిల్లవాడిలాగా మారాంచేస్తూ బుంగమూతితో "భోజ్యేషు మాతా..." అని హైమవంక చూసి నవ్వాడు. ప్రేమ వెల్లివిరుస్తూ ఉన్న చూపులతో ఆమె కాఫీ అతని నోటికి అందించింది. అవకాశాన్ని పురస్కరించుకుని అతడు హైమను దగ్గరకు లాక్కున్నాడు.

"ఊ ఊఁ - ఉండండి - చూడండి మరి, చీరంతా కాఫీ తొణికింది....ఇంతే మీరు ఎప్పుడూను...."

"పోనీలే, నాకేగా ఫైను....చెల్లారాం షాపును మళ్ళా ఒకమారు తాము పవిత్రం చేయాలిసిన అవసరం కలిగిందన్నమాట. ధన్యుణ్ణి...."

"ఈమారే, లేత ఊదాలో కొనండి. ఎంబ్రాయిడరీలో చక్కని సన్న అంచులవి వస్తున్నాయి...."

"జో హుకుం"

హైమ అతని బుగ్గలు సాగదీస్తూ "అంత నవ్వుగా ఉందేం? చెపుతానుండండి మీ పని. నా సంగతి, అసలు మీరు—"

"మళ్ళా దేవిగారు పుట్టింటికి ప్రయాణం—"

"ఆఁ! అదేపని!....మీరు కావలిస్తే వెళ్ళండి....అత్తవారియింటికి...."

కాఫీ తాగడం అయింది. వరద కుర్చీలోనుంచి లేచాడు. సిగరెట్టు ముట్టించ వలెనని అపేక్షపడి, మళ్ళా మానివేసి, నిలుచుని హైమ భుజములమీద చేతులువేసి, ఆమె చక్కదనాన్ని చూస్తూ "నీకు కోపంవస్తే తాళలేను బాబూ! నాకు భయం వేసుకొస్తున్నది. నీవు మీ వాళ్ళయింటికి ప్రయాణం కట్టావా అంటే—"

హైమ అతన్ని కౌగలించుకుని సిగ్గుతో - విలాసంగా గాద్గదికంతో— "మిమ్మల్ని....విడిచి ఉండలేను....నేను అడిగినా, మా వాళ్ళ యింటికి పంపకండి" అని దీనంగా చూసింది.

అతడు "ఆఁ! అంతా నిజమే!" అని ఎకసక్కెముచేసినట్లు నటించాడు.

హైమ చెంపమీద చిన్న జెల్లా యిచ్చి లోపలికి పారిపోయింది. వరద సూట్ వేసుకుని కారులో కాలేజీకి వెళ్ళిపోయినాడు.

* * *

వికసించినవి జాజి
విరులు నీ వేణిలో
ప్రకటించినది వలపు
సుకుమార తనువల్లి ....ఇక నేలనే చెలి

నసలెత్తినవి భావ
నా నవ్య మాధురిసి
నవనవోదయ జీవ
నాలన విలాసాలు....

అళికుమారీ గీతి
కా లాలితమ్ములై
అలయించినవి మల్లి
కా మందహాసాలు....

వెన్నెలలేని లోపం తీర్చడానికి 'వెలుగుదీపాలు' తంటాలుపడుతున్నాయి. హైమ, డ్రెస్సింగ్‌టేబుల్ దగ్గర నిలుచుని తలలో పూలదండ సరిజేసుకుంటున్నది. "మొగవాళ్ళ ఎంతకైనా తగుదురు. ఎంత నిబ్బరం! నా కోసం ఎంత ఉబలాటపడుతున్నా—తపిస్తున్నా—ఎదుటపడేటప్పటికి ఎందుకో అంత అభిమానం, ఆ దర్జా? అనిపించలేకపోయినానుగా ఆయనచేత....నా నోటివెంటే చెప్పించారు. కానీ, ఇంటికి రానీ. భోజనం అయిన తరువాత ని-ద్ర-పో-తా-ను. ఉహుఁ....! సినిమాకు వెళ్దామని పట్టుబడతాను. నా కసి తీరా—ఏం—నన్ను విడిచి ఉండలేనని అనకూడదేం?"

చీకటిపడింది బాగా. కారు చప్పుడౌతుందేమోనని హైమ చెవి ఒగ్గి ఏం ధ్వని అయినా వింటూంది. "అబ్బ ఇవాళ కూడా ఆలస్యమేనా? రెండు నెలలకి—ఈ రాత్రి:-ఇంకెంత సేపటికి వస్తారో? ఇవిగో ఈ కొత్త పుస్తకాల దొంతర్లన్నీ మళ్ళా వచ్చిపడ్డాయి. మా అమ్మే! చదవనిస్తాననుకుంటున్నారు కాబోలు! అన్నీ దాచేయాలి, ఎప్పుడూ చదువేనా?....ఈ సిల్కుషర్టులు ఎప్పుడు కుట్టించుకున్నారో? బాగున్నాయి... ఇవాళ ఇదే తొడుక్కోమంటా. మా నాన్న పెట్టిన పంచలమీదికి ఇవి చాలా చక్కగా ఉంటాయి. ఆ.....ఇదుగో, అసలు సంగతే మరచిపోయినానేం? చాలా ఈ సిగరెట్లన్నీని? కాల్చి పొగ నా మీదికి ఊదుతారు బాబోయ్....! అవి ఉన్నంత సేపూ నేనైనా కనబడతానా? సొరుగులోపెట్టి తాళం వేసేస్తా. ఎప్పుడన్నా ముచ్చటగా నే నిచ్చినప్పుడు కాని, ఎప్పుడూ అగ్నిహోత్రాలేనా?"

ఇంకా కొంచెం పొద్దుపోయింది. మామూలువేళ కూడా దాటిపోతూంది....

"రావలసిందే ఈ పాటికి....ఎక్కడ - ఇంతసేపు ఏం చేస్తున్నారో? అదా సంగతి—పెందరాడే వచ్చేస్తే నా కోసం పరిగెత్తుకువచ్చారని ఉడికిలిస్తానని - ఎక్కడో తిరుగుతూ ఉండాలి....ఏం? అంత నదురేం? అబ్బ! ఈలాగైతే నే నుండలేను. రేపట్నుంచీ కారు వెళ్ళేటప్పుడు నేను కూడా బయలుదేరుతా. అక్కడనుంచి అలాగే షికారుకొట్టి ఇంటికి చేరుకోవచ్చును. అంతే, ఇకనుంచి ఆ పనే చేయాలి."

ఫోను మ్రోగింది.

హైమ వినికూడా విసువుతో ఊరుకుంది: కాని అవతలవాళ్ళు వదలి పెట్ట లేదు....రింగ్ చేస్తూనే ఉన్నారు....“ఎవరో బాబూ! వేళకు సరిగా సిద్ధమైనారు. ఎవరన్నా పిలిచారంటే ఈయన ఇల్లూ వాకిలీ వదిలి, పరుగెత్తుతారు. ఈవేళే....ఈ రాత్రే ఏమంతపని ముంచుకు పోతోందో? నేను పలకను. ఎంతసేపని పిలుస్తారో చూస్తాను.”

అగిపోయింది.

“....అమ్మయ్య!....గండం గడిచింది....ఎనిమిది దాటుతూంది. ఇంకా రాలేదేమా! ఈ పాటికి వస్తూండాలి. రానీ, పనిపట్టిస్తా. మరీ బొత్తిగా భయంలేక చెడిపోతున్నారు. చక్కగా అలంకరించుకుని ఎప్పుడు వస్తారో అని ఎదురు చూస్తూంటే, తమ చిత్తం వచ్చినప్పుడు దయచేస్తారేం?”

మళ్ళా....ఫోను.

అవతలవాళ్ళను మనసులోనే మ్రింగేసే కోపంతో హైమ రిసీవరును అందుకుని పరధ్యానంగా—

“హలో!” అన్నది.

“జనరల్ హాస్పిటల్”.

“అహాఁ”

“డాక్టర్ రామునీమ్మీనన్ మాట్లాడుతున్నది: ప్రొఫెసర్ వరదరాజాకు - ప్రాణాపాయ—”

“ఏమిటి, - ఏమిటి మీ రంటున్నది—ఆఁ”

“కారు ట్రాముతో కొట్టుకున్నది—”

“ఆఁ! ఆఁ! ఎలా ఉన్నారు? చెప్పండి. ఎలా—ఉన్నా—రు—?”

“స్పృహలేదు. వారి స్నేహితు—భార్యను రమ్మనండి—”